మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడిగా మహిపాల్‌రెడ్డి



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడిగా ఎన్‌ఎఫ్‌సీ నగర్ చందుపట్లగూడకు చెందిన కొమ్మిడి మహిపాల్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా ఎన్నికల అధికారి మురళీధర్‌గౌడ్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడిగా ఎంపిక చేసినందుకు పార్టీ పెద్దలందరికీ ధన్యవాదాలని, పార్టీ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానన్నారు.

కాపు సంఘం న్యూ ఇయర్ కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న నందుపటేల్, అనిల్‌కుమార్ పటేల్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ మున్నూరు కాపు సంఘం నూతన సంవత్సరం కేలండర్‌ను ఆ సంఘం అధ్యక్షుడు మన్నె నందుపటేల్ అధ్యక్షతన పట్టణంలో బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్‌పటేల్, ఉపాధ్యక్షుడు రవికాంత్‌కుమార్‌పటేల్, రాంమోహన్ పటేల్, కోశాధికారి వేణుకుమార్‌పటేల్, సంయుక్త కార్యదర్శులు మల్లేశ్‌పటేల్, అశోక్‌పటేల్, సెక్రటరీలు అనిల్‌కుమార్‌పటేల్, రాజ్‌కుమార్‌పటేల్, హరిగోపాల్ పటేల్, ముఖ్య సలహాదారు సభాపతిపటేల్, సలహాదారులు విష్ణుపటేల్, ఆత్మారాం పాల్గొన్నారు.

టీపీసీసీ రాష్ట్ర మహిళా కార్యదర్శిగా జ్యోతి

మల్కాజిగిరి: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా మల్కాజిగిరికి చెందిన గద్వాల జ్యోతి (గోవిందమ్మ) నియమితులయ్యారు. రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు సునీతారావు ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. అధిష్టానానికి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

బోడుప్పల్ బీజేపీ ఈస్ట్ జోన్ అధ్యక్షుడిగా మహేష్

బోడుప్పల్: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ ఈస్ట్ జోన్ అధ్యక్షుడిగా ఏర్పుల మహేష్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుల చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా చెంగిచర్లలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. బాధ్యతలు అప్పగించిన అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు.

వెస్ట్ బీజేపీ అధ్యక్షుడిగా యాదగిరిగౌడ్

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడిగా రాంపల్లి యాదగిరిగౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించించి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ జిల్లా బీజేపీ పార్టీ అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి, మేడ్చల్ అసెంబ్లీ కన్వీనర్ అమర్ మోహన్‌రెడ్డిలతో పాటు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ మురళీధర్‌గౌడ్, ఎలక్షన్ ఇన్‌చార్జి నర్సింహ, బీజేవైఎం ఉపాధ్యక్షుడు చిత్తరంజన్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, బీజేపీ నేతలు రమేష్‌చారి, కరుణాకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్యేక పూజలు

బోడుప్పల్: శ్రీసాయి భవానీనగర్ కాలనీలోని స్ఫటిక లింగేశ్వరసహిత సీతారామాంజనేయ దేవాలయంలో సంక్రాంతి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. బోడుప్పల్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి దంపతులు, ఆలయ ధర్మకర్త జడిగె మంజుల రమేష్‌యాదవ్, ఆలయ పూజారి రాహుల్‌శర్మతో పాటు భక్తులు పాల్గొన్నారు.

దేవాలయ ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ జయగిరి లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా బాలరాజుయాదవ్, బోర్డు సభ్యులుగా కొమురయ్య, మేకల రాము, రఘుకిరాణాచార్యులను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి ఆదేశాల మేరకు ఆలయ ఈవో రమాదేవి, మోహన్‌రెడ్డిలు ప్రమాణస్వీకారం చేయించారు. కాంగ్రెస్ పార్టీ బీ–బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్ రాంచందర్, నాగరాజు, ఫరీద్, నిరంజన్, సత్యనారాయణ, పరమేష్, పాండు, శంకర్, శ్రీనివాస్ యాదవ్, శంకర్, ప్రవీణ్, లక్ష్మణ్, యాదగిరి, సుమలతాయాదవ్, విజయలక్ష్మి, కనకలక్ష్మి, ఆశ, జన్నయ్య, దశరథ్, ఎండీ.యూసీ, సాయి పాల్గొన్నారు.

బీజేపీకి కొత్త సారథులు

- పూర్తయిన బూత్, మండల కమిటీలు
- పార్టీ కార్యకలాపాలకు అనుగుణంగా ఐదు అసెంబ్లీ స్థానాలు రెండు జిల్లా కమిటీలుగా విభజన
- అర్బన్, రూరల్ జిల్లా కమిటీల అధ్యక్ష స్థానాలకు పోటాపోటీ
- ఈ నెల 20 లోగా అధ్యక్షుల పేర్లను ప్రకటించనున్న అధిష్టానం



పటోళ్ల విక్రంరెడ్డి



తిరుమల్‌రెడ్డి



శ్రీనివాస పటేల్





మాధవరం కాంతారావు



నందనం దివాకర్



భానుప్రకాష్

సాక్షి, సిటీబ్యూరో: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి కొత్త రథసారథులు రానున్నారు. ఈ నెల 20 కల్లా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని రూరల్, అర్బన్ బీజేపీ జిల్లా అధ్యక్షులను అధికారికంగా ప్రకటించేందుకు అధిష్టానం కసరత్తు చేస్తోంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తర్వాత బీజేపీ సంస్థాగత బలోపేతంపై దృష్టి సారించింది. సభ్యత్వ నమోదు మొదలు.. బూత్ కమిటీలు, మండల కమిటీలపై కొంత కాలంగా కసరత్తు చేపట్టింది. ముఖ్య కార్యకర్తలు, కేడర్ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవటం ద్వారా వాటిని పూర్తి చేసింది. శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఆవిర్భావం తర్వాత ఇందులోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలను కలిపి భారతీయ జనతా పార్టీ ఒక జిల్లా కమిటీని కొనసాగించింది. అప్పట్లో అధ్యక్షుడిగా బీజేపీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు పూర్తి స్థాయిలో బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత పార్టీ కార్యక్రమాల విస్తరణ తదితర కారణాల నేపథ్యంలో జిల్లా కమిటీని ప్రస్తుతం రూరల్, అర్బన్ జిల్లా కమిటీలుగా ఏర్పాటు చేశారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంతోపాటు 13 పురపాలక సంఘాలు, 62 గ్రామ పంచాయతీలను కలుపుతూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రూరల్ జిల్లా కమిటీని ఏర్పాటు చేసింది. జిల్లా అధ్యక్షుడిగా పటోళ్ల విక్రంరెడ్డి కొనసాగుతున్నారు. కూకట్‌పల్లి, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గాలను కలుపుతూ మేడ్చల్ అర్బన్ జిల్లాను ఏర్పాటు చేయగా.. బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా హరీష్‌రెడ్డిని నియమించారు. అతను పార్లమెంట్ ఎన్నికల ముందు అర్బన్ జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేయటంతో బీజేపీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్.మల్లారెడ్డికి అర్బన్ జిల్లా ఇన్‌చార్జిగా పార్టీ అధిష్టానం బాధ్యతలను అప్పగించింది.

సెగ్మెంట్ల విభజనపై పార్టీలో తర్జన భర్జన

దేశంలోని అతిపెద్ద పార్లమెంట్ స్థానం మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాన్ని అత్యధిక మెజార్టీతో బీజేపీ కైవసం చేసుకుంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కమిటీని ప్రస్తుతం ఉన్నట్లుగానే కొనసాగించాలా.. లేక రెండు లేదా మూడు అసెంబ్లీ నియోజకవర్గాలను కలుపుతూ.. జిల్లా కమిటీలను ఏర్పాటు చేయాలా? అనే విషయంపై పార్టీ నాయకుల్లో తర్జన భర్జన జరుగుతోంది. కొత్తగా ఏర్పాటు చేయనున్న రెండు జిల్లా కమిటీలలో మేడ్చల్, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలను కలుపుతూ రూరల్ జిల్లా కమిటీ, ఉప్పల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గాలను కలుపుతూ అర్బన్ జిల్లా కమిటీగా ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందన్న విషయంపై నాయకులతో పాటు కేడర్‌లో వాడీవేడి చర్చ సాగుతోంది.

- అలాగే ఉప్పల్, మల్కాజిగిరి, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాలను కలుతూ అర్బన్ జిల్లా కమిటీగా, మేడ్చల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలను కలుపుతూ రూరల్ జిల్లా కమిటీగా ఏర్పాటు చేయాలన్న అభిప్రాయాలు కూడా నేతల్లో వ్యక్తమవుతోంది. పార్టీ అధిష్టానం ముందు జిల్లా నాయకులు అర్బన్, రూరల్ జిల్లా కమిటీలకు సంబంధించిన ప్రతిపాదలను పెట్టారు. తుది నిర్ణయంతో కొత్త జిల్లా రథసారథులను త్వరలో ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అధిష్టానం బూత్, మండల కమిటీలతో సహా ముఖ్య నేతల నుంచి కొత్త రథసారథుల నియామకంపై అభిప్రాయాలను సేకరించటం ద్వారా నేతల పేర్లను కూడా ఖరారు చేసినట్లు తెలుస్తోంది.

అధ్యక్ష పదవులపై పోటాపోటీ

భారతీయ జనతాపార్టీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అర్బన్, రూరల్ కమిటీలకు కొత్త రథ సారథులను త్వరలో నియమించనుండటంతో ఆసక్తి కనబరిచే నేతల్లో పోటీ కూడా తీవ్రంగా ఉంది. మేడ్చల్ రూరల్ జిల్లా కమిటీ అధ్యక్ష పదవికి 11 మంది నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డితో సహా జిల్లా నాయకులు జిల్లాల తిరుమల్‌రెడ్డి, బుద్ధి శ్రీనివాసపటేల్, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, శోభారెడ్డి, కూరపాటి విజయకుమార్ పోటీ పడుతున్నారు. పటోళ్ల విక్రంరెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగలేనని పేర్కొంటే తప్ప.. ఇతరులకు ఆ పదవిని కట్టబెట్టవచ్చునన్న చర్చ పార్టీ వర్గాల్లో కొనసాగుతోంది. అలాగే అర్బన్ జిల్లా కమిటీ అధ్యక్ష పదవికి నందనం దివాకర్, భానుప్రకాష్, డాక్టర్ శిల్పారెడ్డి, అడ్వకేట్ ప్రసన్న , శ్రీనివాస్ ముదిరాజ్ పోటీ పడుతున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఆవిర్భావం తర్వాత ప్రథమంగా ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలతో ఏర్పడిన బీజేపీ జిల్లా కమిటీకి అధ్యక్షుడిగా పని చేసిన కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావును కూడా పార్టీ అధిష్టాన వర్గం నియమించవచ్చుననే ప్రచారం కూడా జరుగుతోంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడిపల్లి: 11కేవీ పెద్దమ్మగుడి ఫీడర్ పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా 33/11 కేవీ చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30గంటల వరకు జైశ్రీరాం కాలనీ, కనకదుర్గానగర్, అణుశక్తి నగర్, సిరిపురం కాలనీ, పెద్దమ్మగుడి ఏరియా, మనభూమి వెంచర్, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ హరినాథ్ సగ్గు ఓ ప్రకటనలో తెలిపారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

కాప్రా: ఆదిత్యనగర్ కమ్యూనిటీపార్క్‌లో ఈనెల 17న ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ డాక్టర్ ఏఎస్ రావునగర్ సెంచరీ, శ్రీశక్తి ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు కానుంది. శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో కంటి పరీక్షలు, దంత పరీక్షలు, ఫిజియోథెరఫీ, మహిళలకు కేన్సర్ స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కాప్రా సర్కిల్ పరిధిలోని అన్ని ప్రాంతాలకు చెందిన వారు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అధికారుల సందర్శన

అల్వాల్: కొకూర్ జేకే ఆర్కేండ్ కాలనీలో జీహెచ్‌ఎంసీ అధికారులు సందర్శించారు. బుధవారం కాలనీలో రోడ్డు పనులను నిర్మించేందుకు రోడ్డు కొలతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు తుడిమెల్ల మల్లిఖార్జున్ మాట్లాడుతూ.. కొకూర్ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి ఎంతో ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఏఈ రవళి, అఫ్రోజ్, కాలనీవాసులు అశ్విన్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, శివరాజ్, రూపేందర్‌రెడ్డి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్‌లో.. గాలిపటాలను ఎగురవేస్తున్న కౌన్సిలర్ మహేష్, యువకులు



సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ ఇంటి ముందు ముగ్గులు



ఘట్‌కేసర్‌లో.. ముగ్గులు వేస్తున్న మహిళలు

ఘనంగా సంక్రాంతి వేడుకలు



పూడూర్‌లో.. గాలి పటాలు ఎగురవేస్తున్న చిన్నారులు

మేడ్చల్‌రూరల్/మేడ్చల్: మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలతో పాటు మండలంలోని గ్రామాలలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామాలలో మహిళలు సంక్రాంతి పండగ సందర్భంగా ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి వాటి మధ్య గొబ్బెమ్మలను పెట్టి పూజించారు. ఇళ్లలో పిండి వంటలు చేసుకుని పండగను ఘనంగా జరుపుకున్నారు. యువకులు, చిన్నారులు ఉదయం నుంచే గాలిపటాలను ఎగురవేసి ఆనందంగా గడిపారు.

ఘట్‌కేసర్‌లో..

మున్సిపాలిటీలో సంక్రాంతి పర్వదినం సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి అందంగా అలంకరించారు.



ఘట్‌కేసర్‌లో.. గాలిపటం ఎగురవేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య

కన్నుల పండువగా గోదాదేవి కల్యాణం



ఘనంగా గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం ,



కల్యాణంలో భక్తజనం

ఘట్‌కేసర్: ఎదులాబాద్ శ్రీ గోదా సమేత రంగనాయక స్వామి ఆలయం ఆవరణలో మంగళవారం స్వామి, అమ్మవారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మాంగళ్యధారణ సమయంలో భక్తుల గోవింద నామ స్మరణతో ఆలయ ఆవరణ మారుమ్రోగింది. వివాహం అనంతరం అక్షింతలు పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్తలు టీపీ లక్ష్మణాచార్యులు, రాజగోపాలాచార్యులు, అనంతసేనాచార్యులు, పురుషోత్తం ఆచార్యులు, అచ్యుతా ఆచార్యులు, శ్రీ వత్సవాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

పొగమంచుతో ప్రజల ఇక్కట్లు



పోచారం: చలి తీవ్రత పెరగడంతో పాటు పొగమంచుతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. పోచారం మున్సిపాలిటీలో కనిష్ట ఉష్ణోగ్రతలు 16 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోవడంతో వృద్ధులు చలితీవ్రతను తట్టుకోలేకపోతున్నారు. మరోవైపు రహదారులను పొగమంచు కప్పేస్తుండడంతో బయటకు వెళ్లేందుకు జనం జంకుతున్నారు. ఉదయం ఎనిమిది గంటలు దాటినా పొగమంచు తగ్గకపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు, పాదచారులు స్పష్టంగా కనిపించక పోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి మలుపుల వద్ద మరింత కష్టంగా మారడంతో సాధ్యమైనంత వరకు సొంత వాహనాల్లో అర్ధరాత్రి, తెల్లవారుజామున ప్రయాణాలు చేయకపోవడమే మంచిదని భావిస్తున్నారు.





ఘనంగా క్షేత్రగిరి వెంకన్న జాతర

- అంగరంగ వైభవంగా కల్యాణోత్సవం
- భక్త జనసంద్రంగా మారిన క్షేత్రగిరి
- వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మండలం ఘనాపూర్, రాజబొల్లారం గ్రామాల పరిధిలోని క్షేత్రగిరి వేంకటేశ్వర స్వామి జాతర మహోత్సవం బుధవారం ఘనంగా సాగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో క్షేత్రగిరి భక్త జనసంద్రంగా మారింది. ప్రతీ ఏటా సంక్రాంతి మరుసటి రోజైన కనుమ రోజున క్షేత్రగిరిపై జాతర నిర్వహించడం ఆనవాయితీ. సంక్రాంతి రోజైన మంగళవారం స్వామివారి కల్యాణం నిర్వహించగా కనుమ రోజున జాతర సందర్భంగా ఆలయ అనువంశిక ధర్మకర్తలు బాకరాజు వెంకట రామారావు, దివాకర్‌రావు, ఆలయ ఈవో వెంకన్నల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు గణపతి శివశర్మ బృందం ఉదయాన్నే స్వామివారికి విశేష పూజలు చేశారు. అనంతరం సామూహిక అర్చనలు, పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో పాల్గొనేందుకు మేడ్చల్, శామీర్‌పేట్ మండలాలతో పాటు, నగర వాసులు, మెదక్, సిద్దిపేట్, నల్లగొండ జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులు అనంతరం స్వామివారి పల్లకిసేవ, ఊరేగింపు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులు కుటుంబ సమేతంగా జాతరకు విచ్చేసి సాయంత్రం వరకు గుట్టపై ఆహ్లాదకర వాతావరణంలో ఆనందంగా గడిపారు. వేల సంఖ్యలో భక్తులు రావడంతో గోవింద నామస్మరణతో క్షేత్రగిరి మార్మోగింది. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. మేడ్చల్, శామీర్‌పేట్‌లతో పాటు వివిధ పోలీస్‌స్టేషన్‌ల సిబ్బందితో క్షేత్రగిరిపై బందోబస్తు నిర్వహించారు. మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ బందోబస్తును పర్యవేక్షించారు.

జాతరలో ఎమ్మెల్యే, నాయకులు..

క్షేత్రగిరి జాతర మహోత్సవాల్లో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మేడ్చల్ జిల్లా మాజీ గ్రంథాలయాల చైర్మన్ భాస్కర్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ అనిత, నాయకులు రాజమల్లారెడ్డి, సుదర్శన్, భాగ్యారెడ్డి తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో వెంకన్న, అర్చకులు వారిని సన్మానించి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్ మణికంఠ నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నదానం చేశారు.





జాతరలో కేరింతలుకొడుతున్న చిన్నారులు

స్వచ్ఛతపై వినూత్నంగా అవగాహన

కాప్రా: సంక్రాంతి పండుగ సందర్భంగా సర్కిల్ ప్రజలకు తడి, పొడి చెత్తపై జీహెచ్‌ఎంసీ కాప్రా సర్కిల్ శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన చేపట్టారు. శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్ హరిదాసు వేషధారణలో బసవన్నలతో కలిసి హోటళ్లు, కాలనీల్లో తిరుగుతూ అవగాహన కల్పించారు. కూరగాయల వ్యర్థాలు, పండ్ల వ్యర్థాలు కాలనీ పార్క్ స్థలాల్లోని బహిరంగ ప్రదేశాల్లో, రూఫ్ గార్డెన్ ప్రాంతాల్లో కంపోస్టు ఎరువుగా మార్చుకోవచ్చని వివరించారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.



హరిదాసు వేషధారణతో శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్

స్వచ్ఛతపై అవగాహన ఉండాలి..

కుషాయిగూడ: ప్రతి ఒక్కరిలో సామాజిక స్పృహ కలిగినప్పుడే 100 శాతం స్వచ్ఛత సాధ్యమవుతుందని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా బుధవారం కాప్రా శానిటరీ విభాగం అధికారులు చర్లపల్లి డివిజన్ పరిధిలోని ప్రధాన కూడళ్ల వద్ద ఫ్లెక్సీలు, భారీ హోర్డింగులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటో కార్మికులకు అందజేయాలన్నారు. న్యూస్‌పేపర్లు, పాడైన ఎలక్ట్రానిక్ వస్తువులు, ప్లాస్టిక్ సామగ్రి, పాత బట్టలు, పుస్తకాలను సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌లో వేయాలన్నారు. శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, సిబ్బంది లక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

ప్లాస్టిక్, పేపర్స్ తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం

మల్లాపూర్: నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని త్రిశాల లామినేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో బుధవారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాచారం జాన్సన్ గ్రామర్ స్కూల్ ప్రక్కనా త్రిశాల లామినేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ప్లాస్టిక్, పేపర్స్ తయారీ సంస్థలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా మంటలు చెలరేగి పొగ రావడంతో దుర్గానగర్ కాలనీవాసులు భయాందోళన చెందారు. రెండు ఫైర్ ఇంజిన్‌లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కార్మికులు ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. నాచారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.